క్లుప్తంగా

నేటి సాయంత్రం నుంచి తాగునీటి సరఫరా



నెహ్రూనగర్: సంగం జాగర్లమూడి హెడ్ వాటర్ వర్క్స్ నుంచి గుంటూరు నగరానికి తాగునీటి సరఫరా జరిగే పైప్‌లైన్‌పై ఏర్పడిన లీకుల మరమ్మతులను సోమవారం నుంచి ఇంజినీరింగ్ అధికారులు యుద్ధప్రాతిపదికన చేపడుతున్నారని, మంగళవారం ఉదయానికి పనులు పూర్తి చేసి సాయంత్రం పాక్షికంగా, బుధవారం ఉదయం నుంచి పూర్తిస్థాయిలో తాగునీటి సరఫరా జరుగుతుందని నగర కమిషనర్ కీర్తి చేకూరి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హెడ్ వాటర్ వర్క్స్ సంగం జాగర్లమూడి నుంచి గుంటూరు నగరానికి తాగునీరు సరఫరా చేసే 685 ఎం.ఎం. డయా సీఐ పంపింగ్ మెయిన్ లైన్‌పై ఏర్పడిన లీకు మరమ్మతులను ఇంజినీరింగ్ అధికారులు సోమవారం ఉదయం నుంచి చేపడుతున్నారని తెలిపారు. మరమ్మతులను నిర్దేశిత షెడ్యులు మేరకు మంగళవారం ఉదయానికి పూర్తి చేసి సాయంత్రం నుంచి సరఫరా పునరుద్ధరణ చేపట్టడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. మంగళవారం సాయంత్రం పాక్షికంగా బుధవారం ఉదయం నుంచి పూర్తిస్థాయిలో తాగునీటి సరఫరా చేయడం జరుగుతుందని తెలిపారు.

ఘనంగా శ్రీవారి కల్యాణమహోత్సవం




పాత గుంటూరు: ఆర్.అగ్రహారం వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో 28వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం శ్రీవారి కల్యాణ మహోత్సవం అత్యంత రమణీయంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ, నిత్యార్చన, నారాయణ మంత్ర హవనం, బలి హరణం తదితర కార్యక్రమాలను వేద పండితులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం లక్ష్మీ, గోదా సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం భక్తి ప్రపత్తులతో గావించారు. భక్తులు విశేషసంఖ్యలో పాల్గొని స్వామిని సేవించి తరించారు. భక్తులకు తీర్థ ప్రసాద వితరణ జరిపారు. సాయంత్రం నిత్య హోమం, రథాంగ హోమం, రథ బలి, రథోత్సవం వైభవంగా జరిగింది. కార్యక్రమాలను ఆలయ వ్యవస్థాపకులు కన్నా లక్ష్మీనారాయణ, ఆలయ కార్యదర్శులు పాతకోట బ్రాహ్మణయ్య నాయుడు, దాసరి భాస్కరరావు తదితరులు పర్యవేక్షించారు

ఉత్సాహంగా డిగ్రీ విద్యార్థినుల ఫేర్‌వెల్



గుంటూరు ఎడ్యుకేషన్: బ్రాడీపేటలోని బండ్లమూడి హనుమాయమ్మ (బీహెచ్) మహిళా డిగ్రీ కళాశాలలో సోమవారం డిగ్రీ చివరి సంవత్సర విద్యార్థినులకు వీడ్కోలు పలుకుతూ ఫేర్‌వెల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా సంప్రదాయ వస్త్రధారణతో విద్యార్థినులు ర్యాంప్ వాక్, ఫ్యాషన్ షో, డ్యాన్స్‌లతో ఆకట్టుకున్నారు. కళాశాల అధ్యక్షుడు డాక్టర్ బీవీ విజయభాస్కర్, కార్యదర్శి చేగు శ్రీధర్, ప్రిన్సిపాల్ డాక్టర్ బి.కౌసల్యాదేవి, వైస్ ప్రిన్సిపాల్ రాధామాధవి, అధ్యాపకులు పాల్గొన్నారు.


ఆరోగ్య పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



గుంటూరు రూరల్: ఆరోగ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరమండల్ ఇంటర్నేషనల్ డివిజనల్ బిజినెస్ హెడ్ కేఎస్ఆర్ చక్రవర్తి అన్నారు. సోమవారం రెడ్డిపాలెం గ్రామంలో కోరమండల్ ఫర్టి లైజర్స్ కంపెనీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. కోరమాండల్ సంస్థ తన వ్యాపార అభివృద్ధితో పాటు సామాజిక బాధ్యతతో గ్రామీణ ప్రాంత ప్రజలకు విద్య, వైద్య సౌకర్యాల కల్పన, సామాజిక సేవా కార్యక్రమాలు ఏటా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సామాజిక బాధ్యతలో భాగంగా రెడ్డిపాలెం శివారు న్యూ గుంటూరు రైల్వే స్టేషన్‌లోని హమాలీల కుటుంబాలతో పాటు ఆ ప్రాంత ప్రజలకు ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించినట్లు తెలిపారు. వైద్యులు ఈసీజీ, బీపీ, షుగర్, నేత్ర, గుండె పరీక్షలను నిర్వహించి, సూచనలు, సలహాలు, మందులు అందజేశారు. ఈఎస్ఐ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జ్యోతి, కంపెనీ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కమలాకర్, రీజినల్ లాజిస్టిక్స్ డిస్టిక్ మేనేజర్ ప్రదీప్, జోనల్ మేనేజర్ హరి, రీజినల్ హెడ్ మోహన్ పాల్గొన్నారు.

మూర్ఛ.. లేదిక చింత

- ఆధునిక ఆపరేషన్లతో ఫిట్స్‌కు పెట్టొచ్చు చెక్
- గుంటూరు జీజీహెచ్‌లో ప్రతి శనివారం ప్రత్యేక ఓపీ
- పలు రకాల జాగ్రత్తలతో వ్యాధి నుంచి ఉపశమనం
- నేడు ఫిట్స్ అవగాహన దినం



ఫిట్స్ వ్యాధి బాధితుల, పర్పుల్ డే పోస్టర్

గుంటూరు మెడికల్: ఫిట్స్ వ్యాధి సోకిన వారు ఏ క్షణంలో ఎక్కడ పడిపోతారోననే భయం బాధితుల్లోనూ, వారి కుటుంబ సభ్యుల్లోనూ నిత్యం వెంటాడుతూనే ఉంటుంది. దైనందిన జీవితం సాఫీగా సాగేందుకు బాధితులు ఏళ్ల తరబడి మందులు వాడాల్సి వస్తుంది. కొన్నిసార్లు మందులు వాడుతున్నా ఫిట్స్ నియంత్రణలో లేకపోవటంతో వ్యాధి బాధితులు, వారి కుటుంబ సభ్యులు తీవ్ర ఇబ్బంది పడాల్సి వస్తుంది. వైద్య రంగంలో వచ్చిన ఆధునిక పద్ధతుల ద్వారా నేడు మూర్ఛవ్యాధిని(ఫిట్స్) నయం చేస్తున్నారు. వ్యాధిపట్ల ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రతి ఏడాది మార్చి 26న ప్రపంచవ్యాప్తంగా పర్పుల్ డే (ఫిట్స్) నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం.

మూర్ఛ అనగా (ఫిట్స్)...

మెదడులో ఉన్న న్యూరాన్‌లు విద్యుత్ ఆవేశం ఎక్కువైనప్పుడు బయట కనిపించే లక్షణాలనే ఫిట్స్ అంటారు. ఇది వచ్చినప్పుడు కాళ్లు, చేతులు కొట్టుకుని పడిపోతారు. ఫిట్స్ వచ్చినప్పుడు కొందమందికి నాలుక కొరుక్కోవడం, నోటి నుంచి నురగ కారడం గమనించవచ్చు. ఫిట్స్ ఎక్కువ సమయం ఉండే మనిషి దేహం నీలంరంగుగా మారి ప్రాణాపాయ స్థితికి చేరుకోవచ్చు.

కారణాలు...

మెదడులో వచ్చే ఇన్‌ఫెక్షన్లు, గడ్డలు, తలకు గాయాలు, బ్రెయిన్ స్ట్రోక్స్, మెదడులో రక్తనాళాలు ఉబ్బడం, పుట్టుకతో వచ్చే జన్యుపరమైన సమస్యల వల్ల ఫిట్స్ వ్యాధివచ్చే అవకాశం ఉంది. పిల్లలు, పెద్దవాళ్లలో అందరిలోనూ ఈ మూర్ఛవ్యాధి వస్తుంది. గొంతులో, చెవిలో వచ్చే ఇన్‌ఫెక్షన్స్ వల్ల చిన్నారుల్లో వచ్చే అవకాశం ఉంది. స్త్రీలు ప్రసవ సమయంలో కొన్ని రకాల చికిత్స విధానాలు పాటించకపోవడం వల్ల, టీబీ, హెచ్ఐవీ, మెదడువాపు జబ్బుల వల్ల వైరస్‌లు, బ్యాక్టీరియా, ఫంగస్‌ల వల్ల ఫిట్స్ కేసులు దేశంలో ఎక్కువగా కనిపిస్తున్నాయి.

జిల్లాలో బాధితులు..

జిల్లాల్లో సుమారు 20 న్యూరాలజీ క్లినిక్‌లలో ప్రతిరోజూ వంద మంది వరకు ఫిట్స్ సమస్యతో చికిత్స పొందుతున్నారు. వీరిలో 20శాతం మంది యువకులే ఉన్నారు. గుంటూరు జీజీహెచ్‌లో ప్రతి శనివారం మూర్ఛ వ్యాధి బాధితులకు ప్రత్యేకంగా ఓపీ నిర్వహిస్తున్నారు. వారంలో మూడు రోజులపాటు న్యూరాలజీ ఓపీలో రోజుకు 300 మంది వివిధ రకాల నరాల సంబంధిత సమస్యలతో చికిత్స కోసం వస్తున్నారు. వీరిలో 20 శాతం మంది ఫిట్స్ బాధితులే ఉంటున్నారు.

చేతిలో తాళాలు పెట్టకూడదు...

మూర్ఛకు గురైన వ్యక్తి నేలపై పడిపోకుండా పట్టుకోవాలి. వ్యక్తి తల కింద మెత్తని పరుపు పెట్టి, తలకు దెబ్బతగలకుండా కాపాడాలి. బెల్టు, మెడకున్న టై లేక ఏమైనా బిగుతుగా ఉన్న బట్టలను వదులుగా చేసి, ప్రశాంతంగా ఉండేటట్లు చూడాలి. మూర్ఛఅయిపోయిన తర్వాత శ్వాస ఆడటానికి వీలుగా వ్యక్తిని ఒత్తికిల్లి పడుకునేలా శరీరాన్ని తిప్పి, నోటిలో నుంచి వచ్చే నురుగను తుడిచివేయాలి. వ్యక్తితో ప్రేమగా మాట్లాడుతూ అతడు పూర్తిగా స్పృహలోకి వచ్చే వరకూ అక్కడే వారితోనే ఉండాలి. ఫిట్స్ వచ్చినప్పుడు రోగి చేతిలో తాళాలు పెట్టటం, నోట్లో నీళ్లు పోయటం, గిల్లటం, కాల్చటం లాంటి పనులు చేయకూడదు. మూర్ఛ వచ్చిన వ్యక్తి మెలికలు తిరుగుతూ ఉంటే ఆపకూడదు. రోగి చుట్టూ గుమికూడదు. వ్యక్తి పూర్తిగా కోలుకునేంత వరకు నీళ్లుగాని మరే ఇతర ద్రవపదార్థంగాని ఇవ్వకూడదు. ఫిట్స్ రెండు నుంచి మూడు నిమిషాలుపాటు ఉండి అవే తగ్గిపోతాయి. అంతకు మించి ఎక్కువసేపు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలి. వ్యాధి ఉన్న వారు స్విమ్మింగ్, డ్రైవింగ్ చేయకూడదు. ప్రమాదకర మెషిన్ల వద్ద పనిచేయవద్దు.

మూర్ఛ ఉన్నా పెళ్లి చేసుకోవచ్చు...



మూర్ఛవ్యాధి ఉన్నా పెళ్లి చేసుకోవచ్చు. ఈ వ్యాధి ఉంటే పెళ్లి చేసుకోకూడదనే అపోహ ప్రజల్లో ఉంది. వ్యాధిని నయంచేసే వైద్య సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. వ్యాధి ఉన్నప్పటికీ వారికి పుట్టే పిల్లలు సాధారణంగానే పుడతారు. దీనిపై ఎలాంటి అనుమానాలు పెట్టుకోవద్దు. పిల్లల్లో వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే నరాల వ్యాధి నిపుణులను సంప్రదించటం ద్వారా త్వరిత గతిన వ్యాధినుంచి కోలుకునే అవకాశం ఉంది.

– డాక్టర్ పమిడిముక్కల విజయ, సీనియర్ న్యూరాలజిస్ట్, గుంటూరు

ఆపరేషన్‌తో నయం చేయవచ్చు...



మూర్ఛవ్యాధిని తగ్గించేందుకు ఫిట్స్ మందులు 70 శాతం వరకు పనిచేస్తాయి. కేవలం 30శాతం మంది ఫిట్స్ బాధితులకు ఎన్ని మందులు వాడినా వ్యాధి తగ్గదు. వారికి వ్యాధిని నయంచేసేందుకు ఆపరేషన్లు అందుబాటులో ఉన్నాయి. ఆపరేషన్‌ల వల్ల నూటికి 90 శాతం ఫిట్స్ తిరిగి రావు. మందులు వాడాల్సిన పని కూడా ఉండదు.

– డాక్టర్ బీజాపూరి చంద్రశేఖర్, న్యూరో సర్జన్, గుంటూరు

ఆరోగ్యశ్రీతో ఉచితంగా ఆపరేషన్లు



ఫిట్స్ బాధితులకు డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా అత్యాధునిక వైద్య పద్ధతుల్లో ఉచితంగా ఆపరేషన్లు చేస్తున్నాం. కంప్యూటర్ నేవిగేషన్ అనే అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి, కీ హోల్ సర్జరీ ద్వారా కూడా ఫిట్స్ బాధితులకు రూ.లక్షలు ఖరీదు చేసే ఆపరేషన్లు పూర్తి ఉచితంగా చేస్తున్నాం. గతంలో ఎన్నడూలేని విధంగా అత్యాధునిక ఆపరేషన్‌లను రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంలో చేర్చారు. తద్వారా మూర్ఛ వ్యాధి బాధితులకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఆపరేషన్ చేసి మూర్ఛ వ్యాధి నుంచి విముక్తి కల్పించి నూతన జీవితాన్ని ప్రసాదిస్తున్నాం.

– డాక్టర్ భవనం హనుమ శ్రీనివాసరెడ్డి, న్యూరో సర్జన్, గుంటూరు

వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల్లో నియామకాలు



పట్నంబజారు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నియోజకవర్గంలో పలు అనుబంధ విభాగాల పదవుల్లో పలువురిని నియమిస్తూ.. ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు సోమవారం కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి.

గుంటూరు తూర్పు నియోజకవర్గం...

- తూర్పు క్లస్టర్ 1 : ఎస్సీ విభాగం అధ్యక్షుడిగా కొక్కిలిగడ్డ జాన్‌పాల్, ఎస్టీ విభాగం అధ్యక్షుడిగా భజంత్రి పవన్, బీసీ విభాగం అధ్యక్షుడిగా నిడుముక్కల రాంబాబు, మహిళా విభాగం అధ్యక్షురాలిగా బి.మాధవి.
- క్లస్టర్-2 : ఎస్సీ విభాగం అధ్యక్షుడిగా ఎ.మోహన్‌బాబు, ఎస్టీ విభాగం అధ్యక్షుడిగా భూపతి ఈశ్వరరావు, బీసీ విభాగం అధ్యక్షుడిగా ఎన్.మల్లిఖార్జున, మైనారిటీ విభాగం అధ్యక్షుడిగా షేక్ అమీర్, మహిళా విభాగం అధ్యక్షురాలిగా షేక్ అఫ్రోజా.
- క్లస్టర్-3 : ఎస్సీ విభాగం అధ్యక్షుడిగా కె.నాగేశ్వరరావు, ఎస్టీ విభాగం అధ్యక్షుడిగా కొండారెడ్డి శ్రీనివాసరావు, బీసీ విభాగం అధ్యక్షుడిగా సింగు గౌరీశంకర్ యాదవ్, మైనారిటీ విభాగం అధ్యక్షుడిగా సయ్యద్ ముహీబ్ (టోపీ బాబు), మహిళా విభాగం అధ్యక్షురాలిగా చుండూరు శేషశైలజ.
- క్లస్టర్-4 : ఎస్సీ విభాగం అధ్యక్షుడిగా రామిశెట్టి కోటేశ్వరరావు, ఎస్టీ విభాగం అధ్యక్షుడిగా మేడా ఝాన్సీ, బీసీ విభాగం అధ్యక్షుడిగా పి.సాంబశివరావు, మైనారిటీ విభాగం అధ్యక్షుడిగా షేక్ రఫీ, మహిళా విభాగం అధ్యక్షురాలిగా బెజ్జం కనకదుర్గ నియమితులయ్యారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



మంగళగిరి: నగరంలో వేంచేసియున్న లక్ష్మీ నృసింహస్వామి దివ్య రథోత్సవం సందర్భంగా ఆలయ అధికారులు ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. సోమవారం దివ్య రథోత్సవంలో ఏర్పాటు చేసిన విచిత్ర వేషధారణలు, కోలాటం, నృత్యాలు, మేళతాళాల వంటి ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి.

వైభవంగా వేంకటాచల బ్రహ్మోత్సవాలు



స్వామివారికి హారతి ఇస్తున్న అర్చకులు

పాత గుంటూరు: నందివెలుగు రోడ్డు వసంతనగర్‌లో వేంచేసియున్న పద్మావతీ, గోదాదేవి సమేత కామ్యసిద్ధి వేంకటాచలస్వామి దేవస్థానం అధ్యక్షుడు బూసిరెడ్డి మల్లేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో నవమ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా సోమవారం ఉదయం ఆలయ అర్చకులు దీవికృష్ణ బాలాజీ, శ్రీనివాసుల లక్ష్మీనరసింహాచార్యులు నిర్వహణలో సుప్రభాత సేవ, ప్రాతఃకాలార్చన, విశ్వక్సేన సేవ, పుణ్యాహవాచన, నిత్యహోమం, బలిహరణ, కుంభార్చన నిర్వహించారు. అనంతరం స్వామివారి కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర వైద్యశాఖ మంత్రి విడదల రజిని పాల్గొని స్వామివారిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు. కమిటీ సభ్యులు, అర్చకుల ఆలయ మర్యాదలతో మంత్రికి స్వాగతం పలికారు. అనంతరం మంత్రి విడదల రజినిని ఘనంగా సత్కరించారు. సాయంత్రం వేదపారాయణ, హోమం, బలిహరణ, రథాంగహోమం, రథబలి, హారతి, రథోత్సవం వైభవంగా నిర్వహించారు. విశేషంగా పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమాలను ఆలయ కార్యదర్శి ఎంవీ శేషగిరిరావు, మద్దినేని నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు, సహాయ కార్యదర్శులు పర్యవేక్షించారు.



మంత్రి విడదల రజినిని సత్కరించిన బూసిరెడ్డి మల్లేశ్వరరెడ్డి దంపతులు

ముస్లిం వైద్యుల ఇఫ్తార్ విందు

గుంటూరు మెడికల్: గుంటూరు నగరంలో పనిచేస్తున్న ముస్లిం వైద్యులంతా ఒకే వేదికపై వచ్చి మొట్టమొదటిసారిగా గుంటూరులో ఉన్న ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) వైద్యులకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. స్థానిక అమరావతి రోడ్డు ఏ కన్వెన్షన్ హాలులో ఆదివారం రాత్రి జరిగిన ఇఫ్తార్ విందులో విందు నిర్వాహకులు, గుంటూరు జీజీహెచ్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ షేక్ నాగూర్‌బాషా మాట్లాడుతూ గుంటూరు నగరంలో ఉన్న వైద్యులందరికీ మొట్టమొదటిసారిగా ముస్లిం వైద్యులంతా ఇఫ్తార్ విందు ఇవ్వడం చాలా సంతోషంగా ఉందన్నారు. మతసామరస్యానికి ప్రతీకగా సోదర భావంతో స్నేహ పూర్వక ఆహ్వానాలతో నగరంలోని ప్రముఖ వైద్యులంతా సుమారు వెయ్యి మందికి పైగా ఇఫ్తార్ విందుకు విచ్చేశారని పేర్కొన్నారు. ప్రతి ఏడాది ఇదే తరహాలో ఐక్యతను పెంపొందించేందుకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేస్తామని కార్యక్రమ నిర్వాహకులు, జీజీహెచ్ మాజీ సూపరింటెండెంట్ డాక్టర్ ఫయాజ్ అహ్మద్, డాక్టర్ ముస్తఫా, డాక్టర్ ఆదాం ఖాన్, కార్డియాలజిస్ట్ డాక్టర్ మౌలాలి, కేర్ డెంటల్ కాలేజీ నిర్వాహకులు డాక్టర్ రసూల్ తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు అన్వర్ హుస్సేన్, లతీఫ్, నజీరుద్దీన్, అస్లాం, అహ్మద్, ఫారూఖ్, జాన్‌సైదా, నవాజీస్, అహ్మద్ బాషా, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నాంచారమ్మతల్లి తిరునాళ్ల

శలపాడు(చేబ్రోలు): మండలంలోని శలపాడు గ్రామ దేవత నాంచారమ్మ తల్లి తిరునాళ్ల సోమవారం వైభవంగా జరిగింది. పురాతనమైన అమ్మ వారి ఆలయాన్ని భక్తుల సహకారంతో రెండేళ్ల క్రితం పునఃనిర్మించారు. పాల్గుణ పౌర్ణమి నేపథ్యంలో నాంచారమ్మ తల్లికి అర్చకులు ప్రత్యేక పూజలు, విశేష కార్యక్రమాలు నిర్వహించారు. పంచామృతాభిషేకాలు, విశేష అలంకరణ చేశారు. శలపాడు పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో హాజరై పొంగళ్లు పొంగించి, మొక్కులు తీర్చుకున్నా రు. తిరునాళ్ల సందర్భంగా భక్తులు ఆలయ ప్రాంగణంవద్ద భారీ విద్యుత్ ప్రభలను ఏర్పాటు చేశారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు.



ప్రత్యేక అలంకరణలో నాంచారమ్మతల్లి

సంక్షేమం, అభివృద్ధి జగనన్నతోనే సాధ్యం

- వైఎస్సార్ సీపీ గుంటూరు లోక్‌సభ అభ్యర్థి కిలారి రోశయ్య
- తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి నూరి ఫాతిమాతో కలిసి 56వ డివిజన్‌లో ప్రచారం

పట్నంబజారు: సంక్షేమమే సంకల్పంగా.. అభివృద్ధే అభిమతంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి ముందుకు సాగుతున్నారని పొన్నూరు ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి కిలారి రోశయ్య చెప్పారు. సోమవారం గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని 56వ డివిజన్ నెహ్రూనగర్‌లో ఎన్నికల ప్రచారం తూర్పు నియోజకవర్గ పార్టీ అభ్యర్థి నూరి ఫాతిమాతో కలిసి నిర్వహించారు. ఈసందర్భంగా రోశయ్య మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి చేరాయి కాబట్టే ధైర్యంగా ప్రతి ఇంటికి వెళ్లి ఓటు అడిగే హక్కు వైఎస్సార్ సీపీకి ఉందన్నారు. కుల, మత, ప్రాంత, రాజకీయాలకతీతంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమం అందజేసిన ఘనత సీఎం వై.ఎస్.జగన్‌కే దక్కుతోందన్నారు. రాష్ట్రంలో, విద్య, వైద్యాన్ని ప్రతి ఒక్కరికీ అందజేసి తాను పేదల పక్షపాతినని సీఎం జగన్ చాటి చెప్పారన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయఢంకా మోగించడం తథ్యమని స్పష్టం చేశారు. వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ అభ్యర్థి షేక్ నూరిఫాతిమా మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పక్షాన పోరాడేందుకు ప్రజలు సన్నద్ధంగా ఉన్నారన్నారు. ఎవరెన్ని కుట్రలు చేసినా, కూటములు కట్టినా వైఎస్సార్ సీపీని అడ్డుకునే దమ్ము ఎవరికి లేదన్నారు. నా ఎస్సీలు, నా ఎస్టీలు, నా బీసీలు, నా మైనార్టీలంటూ అణగారిన వర్గాల ప్రజలను తన సొంత మనుషుల్లా భావించే మంచి మనస్సున్న వ్యక్తి జగనన్న అని తెలిపారు. కార్పొరేటర్ కనకదుర్గ, వైఎస్సార్ సీపీ నేతలు మార్కెట్ శ్రీను, నరకట్ల శ్రీనివాసరావు, బోసు, ఎర్రబాబు, చందు అశోక్, విజయలక్ష్మి, నవీన్, ఉమ, లక్ష్మారెడ్డి, మల్లవరపు రమ్య, కోలా భవానీ పాల్గొన్నారు.



డివిజన్‌లో పర్యటిస్తున్న గుంటూరు లోక్‌సభ అభ్యర్థి రోశయ్య, ఎమ్మెల్యే అభ్యర్థి నూరిఫాతిమా

ఆలయాల్లో ప్రత్యేక పూజలు..

గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని పలు ఆలయాల్లో జరిగిన సేవల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి కిలారి రోశయ్య, తూర్పు నియోజకవర్గ అభ్యర్థి షేక్ నూరిఫాతిమా పాల్గొన్నారు. నియోజకవర్గంలోని బుచ్చయ్యతోటలో మహాలక్ష్మి అమ్మవారి ఆలయ పునఃప్రతిష్ఠా కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పాతగుంటూరు సుద్దపల్లిడొంకలో లక్ష్మీ తిరుపతమ్మతల్లి గోపయ్య స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం చేపట్టిన అన్నదానాన్ని ప్రారంభించారు. పాతగుంటూరులోని అగస్త్యేశ్వరస్వామి ఆలయం, కొత్తపేటలో వేంచేసియున్న ఉమామహేశ్వర స్వామి ఆలయాల్లో విశేష పూజలు జరిపారు.

ఘనంగా లక్ష్మీతిరుపతమ్మ తల్లి బ్రహ్మోత్సవాలు

పాతగుంటూరు, సుద్దపల్లి డొంకలో వేంచేసియున్న లక్ష్మీతిరుపతమ్మ తల్లి, గోపయ్య స్వామివారి బ్రహ్మోత్సవాలు ఘనంగా ముగిశాయి. తిరుపతమ్మ తల్లి, గోపయ్య స్వామి కల్యాణ మహోత్సవంలో భాగంగా ఆఖరి రోజున ఆలయం భారీ అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ తూర్పు నియోజకవర్గ అభ్యర్థి షేక్ నూరిఫాతిమా ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదానం చేపట్టారు.

వైభవంగా ధనలక్ష్మీ నారాయణుల కల్యాణం



పాత గుంటూరు: అరండల్‌పేట అష్టలక్ష్మీ సమేత లక్ష్మీనారాయణ స్వామి 29వ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం ఉదయం విరూపాక్ష విద్యారణ్య పీఠాధిపతులు విద్యారణ్య భారతి మహాస్వామి, ఆలయ ప్రధానార్చకులు మర్రిపాటి ప్రసాద్ ఆధ్వర్యంలో శ్రీ చక్రాభిషేకం, నిత్యపూజలు అనంతరం ధనలక్ష్మీ నారాయణుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. వేద మంత్రాల నడుమ ప్రత్యేక పూజలు, అనేక పుష్పాలతో అభిషేకం, విశేష హారతి మంత్రపుష్పం, అష్టోత్తర పూజ, ఓం నమో నారాయణాయ మంత్రంతో శ్రీ ధనలక్ష్మీ నారాయణుల కల్యాణం కనులపండువగా జరిగింది. విశేషంగా పాల్గొన్న దంపతులు భక్తులు తీర్థ ప్రసాదాలను అందుకున్నారు.

లక్ష తమలపాకులతో పూజ

గుంటూరు ఎడ్యుకేషన్: సినీ నటుడు రామ్‌చరణ్ జన్మదిన వేడుకల్లో భాగంగా అఖిల భారత చిరంజీవి యువత ఆధ్వర్యంలో సోమవారం కొత్తపేటలోని ఆంజనేయస్వామివారి దేవస్థానంలో లక్ష తమలపాకులతో పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా అఖిల భారత చిరంజీవి యువత కార్యనిర్వాహక అధ్యక్షుడు మేకల రవీంద్రబాబు మాట్లాడుతూ ఈనెల 27న రామ్‌చరణ్ జన్మదినం సందర్భంగా పెద్దఎత్తున సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చిరు అభిమానులు పాల్గొన్నారు.

హనుమాన్ చాలీసా పారాయణం



ఫిరంగిపురం: మండల కేంద్రంలోని షిర్డీ సాయినాథ మందిర వార్షికోత్సవం సందర్భంగా సోమవారం విశేష పూజలు నిర్వహించారు. స్వామికి అర్చకులు కె.రాఘవేంద్రశర్మ అష్టోత్తర, సహస్రనామాలతో అర్చనలు చేశారు. ఈసందర్భంగా ఆలయంలో పరవస్తు హనుమాన్ సూరి, గీతాభజన మండలి ఆధ్వర్యంలో హనుమాన్, సాయి చాలీసా పారాయణం గావించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

రేపు హుండీ కానుకల లెక్కింపు

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని కంఠంరాజు కొండూరు గ్రామంలో వేంచేసి యున్న శ్రీ మహంకాళి అమ్మవారి దేవస్థానం హుండీ కానుకల లెక్కింపు కార్యక్రమాన్ని ఈనెల 27 తేదీన నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి చినవెంకటరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 27వ తేదీ బుధవారం ఉదయం 10 గంటలకు దేవస్థానం హుండీలలో భక్తులు సమర్పించిన కానుకల లెక్కింపు కార్యక్రమం ప్రారంభమవుతుందని, ఆసక్తి గల భక్తులు కార్యక్రమంలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని ప్రకటనలో కోరారు.